ఫలితాల్లో రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పెనగలూరు : చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చి–2025లో పదోతరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ఆరు మంది విద్యార్థినీ విద్యార్థులు బి.సానియా, ఆర్.కిషన్ సింగ్, ఎస్.వజస్విని, సి.ప్రసాద్, వై.సుధీర్, వై.కళ్యాణిలకు పి.మునెమ్మ స్మారక సంస్థ ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు రూ.20 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో గత పన్నెండు సంవత్సరాలుగా విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్టు సభ్యులు రామాంజులు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతోపాటు క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఎన్ని ఆటంకాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు క్రిష్ణకుమారి ప్రథమ, ద్వితీయ మార్కులు సాధించిన విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయరామయ్య, కె.వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, సి.వెంకటేశ్వరరావు, చంద్రమౌళి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

సిద్దవటం : దోమల నివారణ చర్యలు చేపట్టడం వల్ల జ్వరాలను నిర్మూలించవచ్చునని సిద్దవటం మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు తెలిపారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా సిద్దవటం మండలం ఉప్పరపల్లెలోని ఎస్‌పీబీవీడీ సభా హైస్కూల్‌లో శుక్రవారం మలేరియా వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ దోమలు పట్టకూడదు, పుట్టిన దోమ మానవులను కుట్టకూడదన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు మానవహారంగా నిలుచున్నారు.

పేదల ఆకలి తీర్చడం మహాభాగ్యం


నందలూరు : పేదల కడుపు నింపుతూ వారి ఆకలిని తీర్చటం పుణ్యకార్యమని ఎస్‌ఐ మన్నెం రామమోహన్ అన్నారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వర్గీయ చెంగారి సాయిప్రసన్న 25 జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పేదలకు అల్పాహార వితరణ చేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు మేనేజర్ డి.వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లబ్స్ ద్వారా చేస్తున్నటువంటి ఇలాంటి కార్యక్రమాలతో సేవ చేయటం ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వాకర్స్ కార్యదర్శి ఉప్పుశెట్టి సుధీర్, చెంగారి రామాంజనేయులు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కుర్రా మణియాదవ్, గురుప్రసాద్, కొత్తపల్లి రాజాచారి, రిటైర్డ్ తహసీల్దార్ జయన్న తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే డాక్టర్లు, ఇంజనీర్లు మీరే

రాజంపేట టౌన్ : మరో పది నెలలు ఇష్టంతో కష్టపడి చదివితే డాక్టర్లు, ఇంజనీర్లు అవుతారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ రమణరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు శుక్రవారం ఈఏపీసెట్, నీట్ పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను ప్రిన్సిపల్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రమణరాజు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు ఈ ఏడాది అత్యంత విలువైనదన్నారు. సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకొని ఒక ప్రణాళిక మేరకు ఇప్పటి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. మంచి ర్యాంక్ సాధిస్తే ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యి జీవితాంతం ఉజ్వల భవిష్యత్తును ఆస్వాదిస్తారని పేర్కొన్నారు. అధ్యాపకుల వైపు నుంచి విద్యార్థులకు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తారన్నారు. పాఠ్యాంశంలో ఏదైనా అర్థం కాకుంటే ఒకటికి పదిమార్లు అయినా అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. మీకు తెలిసిన వారిలో ఎవరైనా ఈఏపీసెట్, నీట్‌లలో మంచి ర్యాంకులు సాధించివుంటే వారి సలహాలు, సూచనలు కూడా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమకు ర్యాంకులు రావన్న భావన చాలా మందిలో ఉంటుందని, అయితే ప్రతి ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో చదివిన పలువురు ప్రతి ఏడాది ర్యాంకులు సాధిస్తున్నారన్న విషయాన్ని మరవద్దని తెలిపారు. ఇంటర్మీడియట్‌లోనూ అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.చంద్రమోహన్, చెన్నారెడ్డి, రవి, మురళీకృష్ణారెడ్డి, బాలయ్య, మల్లికార్జున, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





పనిగంటల పెంపుపై పెల్లుబికిన వ్యతిరేకత

- సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన, ధర్నా
- బాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

రాజంపేట : కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల పనిగంటల పెంపుపై వ్యతిరేకత పెల్లుబికింది. ఉద్యోగులు, కార్మికులు ఒక్కటిగా ఆందోళనలకు దిగారు. ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్, ఆటోవర్కర్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావులు మాట్లాడుతూ 10 గంటల పాటు పని చేయాలని క్యాబినెట్ తీర్మానం చేయడం దుర్మార్గపు చర్యగా వారు అభివర్ణించారు. రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలతో చర్చించకుండా కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం సరైనది కాదన్నారు. 8 గంటల పని శాస్త్రీయమైన విధానమని కూటమి ప్రభుత్వం గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం సరైనది కాదన్నారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగులు, కార్మికుల పట్ల సీఎం చూపుతున్న వైఖరిని వారు ఎండగట్టారు. బడా కార్పొరేట్ సంస్థల సేవలో మునిగిపోయిన చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. అదనపు గంటలు కూడా పనిచేయవచ్చునని, మహిళలు కూడా రాత్రివేళలో డ్యూటీ చేయవచ్చునని నిర్ణయాలు చేయడం తీవ్ర వ్యతిరేక చర్య అని దుయ్యబట్టారు. ఎన్నికల ముందుగా భవన నిర్మాణ కార్మికసంఘం బోర్డు పునరుద్ధరిస్తామని చెప్పిన హామీని అమలు చేయడంలేదని వాపోయారు.

రాజంపేట మున్సిపాలిటీ వద్ద..

రాజంపేట మున్సిపాలిటీ వద్ద పనిగంటల పెంపుపై సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పట్టణంలో మెయిన్‌రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల వ్యతిరేక ప్రభుత్వంగా కనిపిస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలతో ఉద్యోగులు, కార్మికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. పనిగంటలు పెంచడమంటే ఉద్యోగులు, కార్మికులు మీద అదనపు పనిభారం మోపినట్లేనన్నారు. సీఎం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఉద్యోగులు, కార్మికుల వ్యతిరేకత మూటకట్టుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, ప్రసాద్, రమణ, మధు తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట: సబ్‌కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ నేతృత్వంలో కార్మికుల ధర్నా

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ఓబులవారిపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని శుక్రవారం మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో ఏఐటీయూసీ కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మాదరాజు గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను బానిసలుగా చేసే విధానానికి స్వస్తిపలకాలని, పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు పూర్తి భద్రత కల్పించాలన్నారు. పది గంటల పని విధానం రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం ఉపసంహరించుకోవాలని, లేబర్ కోర్స్ రద్దు చేయాలని, రాత్రిపూట మహిళలతో పని చేయించాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల కృష్ణ చైతన్య, త్రివేణి కార్మిక సంఘ నాయకులు, ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో కార్మికుల నిరసన


రైల్వేకోడూరు అర్బన్: మండల కేంద్రంలో కార్మికుల నిరసన

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు 8 గంటల పనిదినాలను పది గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని, వెంటనే ఉపసంహరించకపోతే నిరసనలు తప్పవని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ అమర్నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. 139 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిని పెట్టుబడిదారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్ పేరుతో 12 గంటలు, 10 గంటలు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



సంబేపల్లె : ఉపాధ్యాయులు విధి నిర్వాహణలో ఉత్తమ సేవలు అందించినప్పుడే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని సంబేపల్లె జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్నారు. ఈ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయుల వృత్తి ఎంతో పవిత్రమైందని దానిని సక్రమంగా నిర్వహించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఉన్నత పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులను మరువలేమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సన్మానించారు.

కోటి సోలార్ కనెక్షన్లు లక్ష్యం

పెనగలూరు : కోటి సోలార్ కనెక్షన్ల లక్ష్యంగా పెట్టుకున్నామని విద్యుత్ ఈఈ ఎస్.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో విద్యుత్ సిబ్బంది ప్రజలతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగే రోజుల్లో ప్రతి ఇంటికీ సోలార్ కనెక్షన్ తీసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సోలార్ కనెక్షన్ వల్ల విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. రైతులకు కూడా ఖర్చు తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం సోలార్ ఉపయోగం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఈ మురళీధర్ రెడ్డి, జేఈ అఖిల్ బాబు, పెనగలూరు లైన్‌మెన్ చిన్న, సచివాలయ విద్యుత్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ


సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న కార్యకర్తలు

లక్కిరెడ్డిపల్లి : ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఎంపీపీ నివాసంలో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని గ్రామాల ప్రజలు తరలివచ్చి కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఆకేపాటి



నందలూరు : మండలంలోని నారాయణరాజుపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వీఆర్‌ఓపై చర్యలు చేపట్టాలి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కలకడ మండలం బాటవారిపల్లి కాలనీకి చెందిన సోంపల్లె రాజమ్మపై దాడి చేసిన కలకడ వీఆర్వోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోంపల్లె రాజమ్మ భర్త కలకడ మండలం తహసీల్దార్ కార్యాలయంలో బాటవారిపల్లె వీఆర్వో షాజహాన్ వద్దకు వెళ్లి మా నాన్న పేరు మీద ఉన్న భూమిని నా పేరున రాయించాలని అడిగినందుకు మెడ పట్టుకొని బయటికి నెట్టేసి ఎవరికి చెప్పుకొంటావో చెప్పుకోపో అనడమే కాక దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. మహిళపై దాడికి పాల్పడిన వీఆర్వోను వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజమ్మ తండ్రి పేరున 95 సెంట్లు ఉండగా అందులో కాల్వకు 50 సెంట్లు పోయిందన్నారు, కాల్వకు పోయిన భూమికి వచ్చిన డబ్బులు రాజమ్మకు రానీయకుండా వేరేవారికి తప్పుడు అగ్రిమెంట్ రాసి డబ్బులు వచ్చేలా చేశారని బాధితురాలు ఆరోపించినట్లు తెలిపారు. అందుకే వీఆర్వో ఆమెపై దాడి చేశారని అలాంటి అధికారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు సిగి రెడ్డయ్య, రమణలు పాల్గొన్నారు.

పరామర్శ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు హస్తవరం సుబ్బరాంరెడ్డి ఇటీవలే మోకాలు ఆపరేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆయనను పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గొబ్బిల్ల త్రినాథ్‌యాదవ్, అరిగెల సౌమిత్రి, గీతాల నరసింహారెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, మహబూబ్‌బాషా, మధురాజు, అనాల మధుయాదవ్, స్వామి ఏలుమల్లై, ఉపసర్పంచ్ ఇబ్బుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

రాయచోటి టౌన్ : ఆటో డ్రైవర్లు తప్పకుండా నిబంధనలు పాటించాలని అప్పుడు ప్రమాదాలను నివారించవచ్చుని రాయచోటిసీఐ బివి చలపతి తెలియజేశారు. శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై సూచనలు, సలహాలు అందించారు. సీఐ మాట్లాడుతూ యూనిఫాం తప్పకుండా ధరించాలని, ఆటోకు సంబంధించిన రికార్డులు తప్పకుండా ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రజా సేవలో రెవెన్యూ సిబ్బంది కీలకపాత్ర


చిట్వేలి: మాజీ వీఆర్‌ఓను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది


పెనగలూరు: రిటైర్డ్ డీఆర్‌ఓ ఈశ్వరయ్యను సన్మానిస్తున్న తహసీల్దార్ తదితరులు

పెనగలూరు/నందలూరు/చిట్వేలి : ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో రెవెన్యూ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తారని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని మండలాల్లోని రెవెన్యూ కార్యాలయంలో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలు, ఎన్నికల నిర్వహణ, ప్రజలకు ధృవీకరణ పత్రాలు అందజేసి ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతోషకరమన్నారు. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలతో ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. అనంతరం పలువురు రెవెన్యూ సిబ్బందిని ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు.


నందలూరు: విశ్రాంత తహసీల్దార్ జయన్నను సత్కరిస్తున్న అధికారులు

పేదల సమస్యల పరిష్కారానికి కృషి

వీరబల్లి : వైఎస్సార్‌సీపీ తరఫున పేదల ప్రజలకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వీరబల్లి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి కలిశారు. ఇటీవల ప్రకటించిన వైఎస్సార్‌సీపీ పార్టీ పదవుల్లో మోడం నాగభూషణంను రాష్ట్ర వైఎస్సార్‌సీపీ చేనేత విభాగపు జనరల్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా వీరబల్లికి చెందిన నాయకులు నాగభూషణం, మట్లి సింగల్ విండో ప్రెసిడెంట్ రామాంజులు రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు నరేంద్ర నాయుడు, మండల చేనేత అధ్యక్షులు మోడం మదన్‌మోహన్‌లు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానం చేశారు.


ఆకేపాటిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గంగాభవానికి పూజలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ శివారు లోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మ వారికి శుక్రవారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించామని ఆలయ ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి గణపతి పూజ, స్వస్తి వాచనము, మాతృక పూజ, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు మహిళలు అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూలను సమర్పించి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే భాకరాపేట చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేసినట్టు ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించక పోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మీ ప్రాణాలను కాపాడుకొనుటకు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలను నడపవద్దని తెలియేశారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపిన ఎడల వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



యోగాకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి


యోగా చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : మనిషి శరీరంలోని రోగాలను యోగా దూరం చేస్తుందని అలాగే మానసిక, శారీరక పటిష్ఠతను పెంచుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మనిషి రోగాలకు దూరంగా ఉండటంతో పాటు శారీరక, మానసిక పటిష్టతను పెంచడంతో పాటు మనస్సును, ఆత్మతను, శరీరాన్ని ఏకం చేస్తుందన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచి సంపూర్ణ ఆరోగ్యంతో ఏకాగ్రత కలుగుతుందన్నారు. ప్రతి రోజు ప్రతి ఒక్కరూ చిన్నా పెద్ద అనే తేడా లేకుండా కనీసం 30 నిమిషాల నుంచి 45 నిమిషాల వరకు యోగాసనాలు వేయాలని తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. భారతీయ యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం, ఆదరణ పెరిగిందని, అందుకే పాఠశాలలో, ఆస్పత్రుల వంటి ప్రతి స్థాయిలో యోగా వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ పాటించేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని, సామాజిక సేవా సంస్థలను ఆయన కోరారు.

యోగాంధ్రపై అవగాహన

సంబేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీపీఓ రాధమ్మ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు యోగాంధ్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేడు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యులను చేసి విజయవంతం చేయాలని ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా యోగాసనాలను వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





